19న పుచ్చలపల్లి సుందరయ్య స్మారక సభ

- నేటి రాజకీయాలు-భగత్‌సింగ్ ప్రాసంగికతపై ప్రొఫెసర్ (రిటైర్డ్) చమన్‌లాల్ ప్రసంగం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిపిఎం అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని ఈ నెల 19న హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 40వ స్మారక సభను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నేటి రాజకీయాలు : భగత్‌సింగ్ ప్రాసంగికత అనే అంశంపై భగత్‌సింగ్ ఆర్కీవ్ గౌరవ సలహాదారులు, జెఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ చమన్‌లాన్ స్మారకోపన్యాసం చేయనున్నారు. బుధవారం ఈ మేరకు ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్వీకే ట్రస్టు అధ్యక్షులు బివి రాఘవులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మేనేజింగ్ కమిటీ సభ్యులు జి.బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొంటారని తెలిపారు. స్మారకోపన్యాసం సోమవారం సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రారంభమవుతుందనీ, సభానంతరం సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.

సమిష్టి బాధ్యతతో పర్యావరణాన్ని కాపాడుకుందాం

- పుష్కరాల పోస్టరావిష్కరణలో మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరస్వతి పుష్కరాలను విజయవంతం చేయాలని, వాటికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ సమిష్టిబాధ్యతగా తీసుకుని పర్యావరణాన్ని కాపాడుకుందామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26- వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం సచివాలయంలో మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేదించడం, బట్టలుతకడం, వ్యర్థాలను సరిగ్గా నిర్వహించడం, నీటి కాలుష్యం నుంచి చర్మ వ్యాధులను నివారించడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచడం అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల వాహన కాలుష్యం తగ్గించొచ్చని సూచించారు.

సులభతరంగా అనుమతుల ప్రక్రియ

- దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి తెర
- లైడార్ సర్వేతో వనరుల మ్యాపింగ్
- అన్ని విభాగాల విభజనలో ఏకరూపత
- ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి


సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతుల ప్రక్రియ సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పౌర సేవలు, అనుమతులపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఏదైనా నిర్మాణం లేదా గృహాలు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన సేవలకు ఒకే ప్లాట్‌ఫాంపై దరఖాస్తు అందజేస్తే వారికి అవసరమైన సేవలన్నింటికి సింగిల్ విండోలో అనుమతి లభించేలా ఉండాలన్నారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆయా శాఖల వసూలు చేసే బిల్లుల సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానం ఉండాలన్నారు. వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని ఆయా విభాగాల ఖాతాల్లో జమ అయ్యే విధానాన్ని రూపొందించాలన్నారు.

ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని... మరింత సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సిఎం సూచించారు. పౌర సేవలు మెరుగ్గా అందేందుకు గానూ వివిధ శాఖల విభజనలో ఏకరూపత ఉండాలని సూచించారు. అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం చేయకూడదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీల్లేదన్నారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే అందుకు కారణాలు ఏమిటో దరఖాస్తుదారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి ఏం చర్యలు తీసుకోవాలో కూడా అధికారులే సూచించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఎండి అశోక్ రెడ్డి, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ఇవి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయాల్సిందే లేకుంటే ప్రజా ఉద్యమం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ముందు ప్రజలు, ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీల అమలు గురించి అడిగితే డబ్బుల్లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పించుకునే సమాధానం చెప్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు వాగ్ధానాలు ఇచ్చినపుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా?అని ప్రశ్నించారు. అధికారం కోసం వాగ్ధానాలు ఇస్తాం, తర్వాత తప్పించుకుంటామంటే కుదరదని అన్నారు. వాటిని అమలు చేయకుంటే ప్రజలు ఉద్యమంలోకి వస్తారనీ, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. బుధవారం ఎంబి భవన్‌లో జాన్‌వెస్లీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కరాచీ బేకరీపై మతోన్మాద అరాచక శక్తులు దాడి చేశాయన్నారు. ఆ పేరును మార్చుకోవాలంటూ కోరుతున్నాయని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమై పోరాడుతుంటే ఇలాంటి మతోన్మాద అరాచక శక్తులు ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరాచకాలను అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చెప్పారు. నిజామాబాద్‌లో విడిసిలు రజకులు, గౌడ కులస్తులను ఇటీవల సాంఘిక బహిష్కరణ చేశాయన్నారు. వీడీసీలపై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

క్యాన్సర్ బాధిత కుటుంబానికి సిఎం అండ

- చికిత్సకు రూ.12 లక్షలు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మి ప్రసన్న, కుమార్తెలు లక్ష్మి సుసజ్ఞ (6), రెండు నెలల స్మయ, తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. ఇంటికి ఆధారమైన సాయిచరణ్ క్యాన్సర్ బారినపడడంతో అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో వారు సిఎంను గతంలో కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చలించిన ఆయన సాయిచరణ్ చికిత్సకు రూ.ఐదు లక్షలు మంజూరు చేశారు. దాంతో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సిఎం ఆర్‌ఎఫ్ ద్వారా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి వచ్చి సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సిఎం సాయిచరణ్‌కు సూచించారు.

కార్మిక హక్కుల్ని హరించే కుట్ర

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోడీ సర్కార్

వెబినార్‌లో ఆర్‌టిసి సంఘాల నేతలు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మోడీ సర్కార్ కార్మిక హక్కుల్ని హరించే కుట్రకు పాల్పడుతున్నదనీ, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఎస్‌డబ్ల్యుయూ (ఐఎన్‌టియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, వైస్ చైర్మన్ జి అబ్రహం, గోపాల్ పిలుపునిచ్చారు. ఈ నెల 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో బుధవారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ రావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగాగా తీసుకు రావటమంటే..కార్మిక వర్గ హక్కులను కాలరాయటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాలను క్రమంగా నీరుగారుస్తూ కార్పొరేట్ల ప్రయోజనాలకు ఆటంకం లేని విధంగా సవరణలను మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్నదని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు హరించటమంటే..క్రమంగా సంఘం పెట్టుకునే స్వేచ్ఛను వదులుకోవటమేనని హెచ్చరించారు. సమస్యలపై ఉద్యమించే హక్కును కోల్పోవటమేనని చెప్పారు. కార్మికుల రక్షణ కోసం ఉన్న చట్టాలను పారిశ్రామిక వేత్తల రక్షణకు ఉపయోగపడే విధంగా సవరించటం పాలకులకు తగునా? అని ప్రశ్నించారు. రాజిరెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చినా కార్మిక వర్గ ప్రతిఘటన వల్ల వాటి అమలుకు సాహసించటం లేదని చెప్పారు.అబ్రహం, గోపాల్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాల్సిన అవశ్యకతను వివరించారు. ఆర్‌టిసిలో ఉద్యోగుల రక్షణ, ఉద్యోగ భద్రత కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

తలసేమియాపై అవగాహన పెరగాలి

- టిఎస్‌సిఎస్ క్యాంపెయిన్‌లో నిపుణులు

ప్రజాశక్తి - హైదరాబాద్

నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లకు తలసేమియా, సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ, నిర్వహణతో పాటు నివారణలో తాజా పరిణామాలపై శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎంఇ) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) తెలిపింది. దీనికి మల్కాజ్‌గిరి జిల్లా కీసర డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ బానోత్ సత్యవతి హాజరై మాట్లాడుతూ.. అట్టడుగు స్థాయిలో జన్యు రుగ్మతలకు సంబంధించి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో నిరంతర వైద్య శిక్షణ కీలక పాత్రను పోషిస్తుందని అన్నారు. దీనిపైన మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వి సంధ్య, ఎం. మమత, నర్సింగ్ నిపుణులు, ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు.

హమ్మయ్యా.. గట్టెక్కినట్టే..

- అవసరాలకు మించి జలవనరులను వినియోగంపై ప్రత్యేక దృష్టి
- జలమండలి ఎండి ప్రత్యేక ప్రణాళికలతో తీరిన నీటికష్టాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎండలు మండిపోయాయి.. నగరంలో భూగర్భజలాలు అడుగంటాయి.. బహుళ అంతస్తుల భవనాలు కొత్తగా వెలుస్తున్నాయి.. జలాశయాలల్లో నీళ్లమట్టాలు తగ్గాయి.. నగరంలో ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది.. ఎంతో ప్రాముఖ్యమైన నీటిని అవసరాలకు మించి కొందరు వినియోగిస్తుంటే.. మరికొందరు వృథా చేస్తున్నారు.. ఈ క్రమంలో డిమాండ్‌ను బట్టి నీరును సరఫరాచేయడం అంత ఆషామాషీ కాదు.. అయినా గ్రేటర్‌లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా జలమండలి రోజువిడిచి రోజు తాగునీరును అందిస్తోంది. జలమండలి ఎండి ఆశోక్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు.. ముందుచూపుతో గత ఏడాదితో పోల్చితే ఈ సారి నీటి కష్టాల నుంచి గట్టేక్కాం.. పెద్దగా ఇబ్బందులు తలెత్తకుండానే నగరవాసుల దహార్తి తీరుస్తున్నారు.

కోటి 30 లక్షల మంది జనాభా కలిగిన హైదరాబాద్‌కు రోజూ తాగునీరు సరఫరా చేయడం పెద్ద సవాల్‌తో కూడుకున్న పని. జలమండలి పరిధిలో 13.5 లక్షల నీటి కనెక్షన్లలో సుమారు 8.5 లక్షల కనెక్షన్లకు ఉచితంగా తాగునీరు అందిస్తోంది. దాదాపు 150 కిలోమీటర్ల నుంచి పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నీటిని తరలిస్తున్న జలమండలి.. ప్రతి కుటుంబానికీ నెలకు 20 వేల లీటర్ల వరకు నీటిని సరఫరా చేస్తోంది. నాణ్యతా ప్రమాణాలతో అందించేందుకు సగటున ప్రతి 1000 లీటర్లకూ రూ.48 ఖర్చు చేస్తోంది.

అధికారులకు దిశానిర్దేశం..

రోజూ నగరానికి 3500 మిలియన్ లీటర్లు అవసరం. ప్రస్తుతం 2600 మిలియన్ లీటర్ల నీటిని గ్రేటర్‌తోపాటు ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. సమృద్ధిగా సరఫరా చేయడంలో జలమండలికి సవాల్‌గా మారింది. భూగర్భ జలాలు పడిపోయాయి.. అపార్టుమెంట్లు పెరుగుతున్నాయి.. చాలా ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. అయినా కొందరు తాగునీటిని అవసరానికి మించి వినియోగిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్న విషయాన్ని జలమండలి అధికారులు ఎంత ప్రచారం చేసినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంతో విలువైన నీటిని కొందరు మొక్కలకు, గార్డెనింగ్‌కు, ఫ్లోర్, వాహనాలను కడగడానికి వినియోగిస్తున్నారు. మరికొందరు నల్లాలకు మోటార్లు బిగించి నీటిని లాగేస్తున్నారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో లో ప్రెజర్ ఫిర్యాదులు రావడంతో అప్రమత్తమైన జల మండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జలమండలి పరిధిలోని అన్ని డివిజన్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇదిలా ఉండగా జలమండలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అందుబాటులో ఉండేలా మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నారు. నీటి వృథాను గుర్తించి.. ఫొటో, వినియోగదారుని సమాచారం, నీటి క్యాన్ నెంబర్ తదితర అంశాలను నమోదు చేస్తే యాప్‌లోనే జరిమానా నోటీసు సిద్ధమవుతుంది. వినియోగదారు నమోదు చేసుకున్న ఫోన్ నెంబర్, మెయిల్‌కు నోటీసు వెళ్లేలా యాప్ ఉండనుంది. ఈ యాప్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.

నీటిని వృథా చేయొద్దు: ఎండి అశోక్‌రెడ్డి

నగరంలో భూగర్భజలాలు అడుగంటడంతో ట్యాంకర్ల డిమాండ్ ఈ సారి బాగా పెరిగిందని జలమండలి ఎండీ తెలిపారు. 22 వేల మంది 90 శాతం అంటే 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేసినట్టు గుర్తించామని, వారి గహాల్లో సర్వే చేస్తే, ఇంకుడు గుంతలు లేనట్టు తేలిందన్నారు. అదే వారి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు ఉంటే నీటి సమస్యలు పెద్దగా వచ్చేవికావని, భూగర్భజలాలు పెరిగేవన్నారు. ఇంకుడు గుంతలు లేనివారు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేశామని చెప్పారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. తాగునీటి ప్రాముఖ్యాన్ని గుర్తించి వర్షం నీటిని ఒడిసి పట్టి సహజ వనరులను భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కడైనా తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అయినా, లేదా నీటి సరఫరాలో ఏవైనా సమస్యలు తలెత్తినా, సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలని, లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మల్లాది రామకృష్ణ శాస్త్రి రచనలు సంప్రదాయం, ఆధునికత కలబోత



ప్రజాశక్తి కల్చరల్

మల్లాది రామ కష్ణ శాస్త్రి రచనలు సంప్రదాయం, ఆధునికత కలబోతగా చక్కని భాష పద ప్రయోగం పాఠకులలో ఆసక్తి కలిగించే విధంగా ఉంటాయని హాస్య అవధాని ప్రముఖ జర్నలిస్ట్ శంకర నారాయణ అన్నారు. అయన గొప్ప సాహితీ విశ్వవిద్యాలయం అని అభివర్ణించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా విఖ్యాత కవి పండితులు మల్లాది రామ కృష్ణ శాస్త్రి యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా శంకర నారాయణ పాల్గొని మాట్లాడుతూ మల్లాది రామ కృష్ణ శాస్త్రి దేశ భాషలే కాక విదేశీ భాషలు జర్మనీ ,ఫ్రెంచ్, రష్యన్ వంటి భాషల్లోనూ సాధికారత కల బహు భాషా విజ్ఞాని అని చెప్పారు. అయన రచించిన కథలు తెలుగు భాషకు ప్రామాణికంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జీవితమంతా జ్ఞానసంపద కోసం కృషి చేసిన రామకష్ణ శాస్త్రి అత్యంత నిరాడంబర జీవితం గడిపారనీ గుర్తు చేసారు. సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ రహస్యం సినిమాలో గిరిజా కల్యాణం కన్యా శుల్కంలో చిటారు కొమ్మన మిఠాయి పొట్లం చేతి కందది అని వ్యంగ్య ధోరణిలో తిరుమల గిరి వాసా నిత్య మంద హసా అంటూ భక్తి పాటలులో తెలుగు నుడి కారం ఉట్టి పడుతుందని వివరించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నతికి కారకులైన మల్లాది వంటి వారిని గుర్తు చేసుకోవడం ఆనందం కలిగిస్తుంది అన్నారు. వేదిక పై గాయకులు శ్రీ మణి ధారా సుబ్రహ్మణ్యం వందే భారత్ సినీ నిర్మాత దర్శకుడు మల్లం రమేష్ తదితరులు

అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

- ఇంటర్ విద్యా డైరెక్టర్‌కు టిజిజెఎల్ఎ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టిజిజెఎల్ఎ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యను బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వస్కుల శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2023, మేలో క్రమబద్ధీకరించిన అధ్యాపకులకు రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. వార్షిక ఇంక్రిమెంట్ విషయంలో కొంతమంది కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. నూతన అధ్యాపకుల సర్వీస్ విషయాలకు సంబంధించి ఎవరికీ ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామనీ, ఎవరైనా కావాలని ఇబ్బందులకు గురిచేస్తే అధికారుల దృష్టికి తేవాలన్నారని పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి జరిగే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పెరిగేలా చూడాలన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేటట్టు డీఐఈవోలు, కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లామన్నారని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేటట్టు చూస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వారికి హాస్టల్ వసతి కల్పించేలా కలెక్టర్ల సహకారం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిజెలెఎ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయిని శ్రీనివాస్, గోవర్ధన్, పూర్ణచందర్, సాయిలు, కెపి శోభన్‌బాబు, మహిళా కార్యదర్శి సంగీత, నాయకులు షాహీనాబేగం, విశాలాక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యాపకుల సర్వీస్ విషయంలో రక్షణ కల్పించాలంటూ అధికారుల కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు.


కెసిఆర్‌కు కవిత రాసిన లేఖను బయట పెట్టాలి : సామా రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సీఎం కేసీఆర్‌కు కల్వకుంట్ల కవిత రాసిన లేఖను బయట పెట్టాలని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అప్పుడే ఆమెను ప్రజలను నమ్ముతారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రానున్న రోజుల్లో కొత్త పార్టీ పెట్టాలనే ఆమె ఆలోచనను స్వాగతిస్తామన్నారు తన తండ్రి పాలనపై ఆమె తన అసంతృప్తిని బాహాటంగా మాట్లాడడం మంచి పరిణామమని చెప్పారు.

బిటి పత్తి విత్తనం మరింత ప్రియం!

- ప్యాకెట్‌పై రూ.37 పెంచిన కేంద్రం
- ఉమ్మడి వరంగల్‌పై రూ.5.73 కోట్ల భారం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిటి పత్తి విత్తనాల ధరను ప్యాకెట్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.37 పెంచింది. దాంతో ఉమ్మడి వరంగల్ రైతాంగంపై రూ.5.73 కోట్ల భారం పడింది. గత ఏడాది 450 గ్రాముల బిటి రెండు పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.864 ఉండగా, ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్యాకెట్‌పై రూ.37 పెంచడంతో ప్యాకెట్‌ను రూ.901లకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతియేటా డిటి-2 పత్తి సాగు గణనీయంగా రైతులు చేస్తున్నారు. ఈ మేరకు ఈ ఏడాది బిటి-2 పత్తి సాగు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో పత్తిని రైతులు గణనీయంగా సాగు చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారు. జనగామ జిల్లాలో సుమారు 95 వేల నుంచి లక్ష ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ములుగు జిల్లాలో మాత్రమే పత్తి కేవలం 20,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. హన్మకొండ, మహబాబాబాద్ జిల్లాల్లో సుమారు 80 వేల ఎకరాల మేరకు పత్తిని రైతులు సాగు చేయడం జరుగుతుంది. కాగా, కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా బీటీ-2 పత్తి విత్తనాల ధరలు పెంచడం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది 450 గ్రాముల ప్యాకెట్‌పై రూ.37 పెంచినట్టు ఇప్పటికే వ్యవసాయ శాఖకు ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు విత్తన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు బీటీ 2 పత్తి విత్తనాలను ఇప్పటికే తెప్పించుకున్నారు. హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలో ఇప్పటికే 40 వేల బీటీ 2 పత్తి విత్తనాల ప్యాకెట్లు చేరి ఉన్నాయి. గతంలో ఎకరాకు 2 ప్యాకెట్ల విత్తనాలను మాత్రమే రైతులు విత్తేవారు. ఇప్పుడు ఎకరాకు 3-4 ప్యాకెట్లను విత్తుతుండటంతో ప్యాకెట్లు అధికంగా కొనుగోలు చేయాల్సి వస్తుంది. అలాగే ములుగు జిల్లాలో పత్తి సాగు ఈ ఏడాది పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్న వ్యవసాయాధికారులు 1 లక్ష పత్తి విత్తన ప్యాకెట్లకు ఇండెంట్ పెట్టారు. ఈ ఏడాది మార్కెట్‌లో మిర్చి ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఈసారి పత్తి సాగుకు అధికంగా మొగ్గే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికనుగుణంగానే పత్తి విత్తనాలను అధికంగా స్టాకు తెప్పించి మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు.

విత్తన అమ్మకాలపై నిఘా..

ప్రతియేటా విత్తన మార్కెట్‌లో అక్రమాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. నాసిరకపు విత్తనాలు, అనుమతులు లేని విత్తనాలను మార్కెట్‌లోకి తీసుకువచ్చి దళారులు, అక్రమార్కులు రైతులను నమ్మించి మోసం చేసి దోచుకుంటున్నారు. ఈ ఏడాది ఎండాకాలం సాగులో పర్వతగిరి మండలంలో మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తి ఏపుగా పెరిగినా కంకులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనిపై రైతులు పెద్ద ఎత్తున వచ్చి అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాసిరకం పత్తి, మిర్చి విత్తనాలను భారీగా విక్రయించిన సందర్భాలూ లేకపోలేదు. ఈసారి వానాకాలం సాగులో విత్తన అమ్మకాలపై నిఘా పెంచాలని పోలీసు, వ్యవసాయ శాఖలకు కలెక్టర్లు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో విత్తన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లతో జిల్లా కలెక్టర్లు సమావేశం నిర్వహించారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించవద్దని స్పష్టం చేశారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విత్తనాలను విక్రయించాలని, లైసెన్స్‌డ్, సర్టిఫికేషన్ ఉన్న విత్తనాలను మాత్రమే అమ్మాలని, ఇందుకు విరుద్ధంగా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్‌లో విత్తనాల సౌలభ్యంపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని, రైతులకు విత్తనాలను సౌలభ్యంగా నిల్వ చేయాలని సూచించారు. ఇప్పటికే అధికారులు ఈ విషయంలో క్షేత్రస్థాయిలో డీలర్ల నుండి సమాచారం తీసుకుంటున్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయటమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు
- ప్రభుత్వం ఖర్చు చేసిన లెక్కలు వెల్లడిస్తాం : భట్టి విక్రమార్క



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఐదేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చి దిద్దటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు వెళు తున్నామని ఇందులో భాగంగా మొదటి సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలో రూ.22 కోట్ల వ్యయంతో 50 పడకల ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శాఖకు రూ.11,600 కోట్లు ఖర్చుపెడుతున్నామన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం, పేద ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ, ప్రతి ఊరికి ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు లెక్కలతో సహా త్వరలో వెల్లడిస్తామన్నారు. ధనిక రాష్ట్రాన్ని బిఆర్ఎస్ చేతిలో పెడితే పదేండ్లు రాష్ట్రాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారన్నారు. రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా, అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద సంఖ్యలో ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇల్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇండ్ల నిర్మాణం కోసం రూ.22,500 కోట్లు కేటాయించామన్నారు.

అటవీ హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరా గిరి జల వికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంప్ సెట్లు, సోలార్ విద్యుత్తు, పామాయిల్, ఆవకాడ మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, వారందరికీ రూ. పది లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నామని, కొత్త చికిత్సలను చేర్చామని అన్నారు. ఇది రాష్ట్ర ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న పెద్ద భరోసా అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తామన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి రూ.11,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కలిగిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు రూ.9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామని, జూన్ 2న లబ్దిదారులను ఎంపిక చేసి లెటర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజిమిల్ ఖాన్, ఆర్డిఒ నరసింహారావు, డిపిఒ ఆశాలత, డిఎంహెచ్ఒ కళావతిభాయి, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి, తహసీల్దారు ఉషాశారద, ఎంపిడిఒ సురేందర్, గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సౌజన్య, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల పనివేళల మార్పునకు సిఎం అంగీకారం

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సంబంధించి పనివేళల మార్పునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సిఎంను ఆయన కలిశారు. విద్యారంగ సమస్యలపై చర్చించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను అందించాలని కోరారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పరస్పర బదిలీలకు సంబంధించి ఉత్తర్వులను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులను ఉత్తర్వులను జారీ చేయాలంటూ సిఎం రేవంత్‌రెడ్డి సూచించారని తెలిపారు. విద్యారంగ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి చర్చల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు
మా పార్టీ ఎల్లప్పుడు సిద్ధమే..

- సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతి చర్చల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తమ పార్టీ ఎల్లప్పుడు సిద్ధమేనని సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం ఇందుకు సుముఖమా కాదా స్పష్టం చేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాంతి చర్చలు జరపాల్సిందిగా ప్రభుత్వాన్ని పంపించేందుకు ముందుకు రావాలని కోరారు. కాల్పుల విరమణ ప్రసక్తే లేదని, మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టకుండా వారితో శాంతి చర్చలు జరిపే అవకాశాలు లేవని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి అజయ్ శర్మ ప్రకటించడం సరికాదన్నారు. ఎటువంటి షరతులు లేకుండా శాంతి చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధమని హోంమంత్రి అజయ్ శర్మ పదేపదే చేసిన ప్రకటనకు భిన్నంగా కాల్పులకు విరమణ ప్రకటించకుండా మావోయిస్టులు ఆయుధాలు విడిచి పెట్టాలని షరత్తు పెట్టడం దారుణమన్నారు. నిజానికి తమ పార్టీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా దాదాపు 16 రాష్ట్రాల్లో పనిచేస్తున్నదని చెప్పారు. శాంతి చర్చల విషయంలో కేంద్ర ప్రభుత్వం హెూం మంత్రి అమిత్ షా స్పందించవలసి ఉందని స్పష్టంచేశారు. గోది మీడియా శాంతి చర్చలపై విష ప్రచారంలో ఈస మంత కూడా వాస్తవం లేదన్నారు. తెలంగాణలో ప్రత్యేకించి అనేక వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, శాంతికాముకులు సభలు, సమావేశాలు, నిరసనల ద్వారా శాంతి చర్చలకు అనుకూల వాతావరణాన్ని ఏర్పరచేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కానీ వీరిపై అర్బన్ నక్సల్స్ ముద్ర వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది సరైంది కాదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి కాల్పుల విరమించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- సిఎస్‌కు ఎమ్మెల్సీ కొమరయ్య వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె రామకృష్ణారావును బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉండడం వల్ల తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. సుమారు రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందిస్తూ మండల విద్యాధికారి, డైట్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులను కల్పించాలని కోరారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. అన్ని యాజ మాన్యాల పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మోడల్ స్కూల్ బోధన, బోధనేతర సిబ్బందికి, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలను చెల్లించాలని తెలిపారు. కెజిబివి, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్)ను వర్తింపజేయాలని పేర్కొన్నారు. 317 జీవో వల్ల ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోరుకున్న జిల్లాలకు బదిలీ చేయాలనీ, ఖాళీలు లేకుంటే తాత్కాలిక సర్దుబాటు చేయాలని కోరారు.

ఏ కొనుగోలు కేంద్రం చూసినా రైతుల కన్నీటి గాథలే

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం-రైతన్నల కన్నీళ్లు, అవస్థలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కని పెంచిన పిల్లలు కళ్ల ముందే కనుమరుగైనట్టు, ఇంటి దూలం ఇరిగి ఒక్కసారిగా భుజం మీద పడ్డట్టు, ఆరుగాలం శ్రమించి పండించిన పంట గాలి వానకు తడిసి ముద్ద అయితే అన్నదాతకు ఎంత యాతనా, ఎంత కడుపు కోత? అంటూ విచారం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఏ కొనుగోలు కేంద్రం వద్ద చూసినా రైతన్నల కన్నీటి గాథలే, ఎవరిని కదిలించినా కన్నీటి వేదనే ఉందని తెలిపారు. పోలీసు పహారా మధ్య, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి సమీక్షలు చేసే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా కళ్లు తెరవాలని కోరారు. తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇవ్వాలని, కొనుగోళ్లు వేగంగా జరిపి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలనీ, దేశానికే అన్నం పెట్టే రైతుల బతుకులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

హామీలు విస్మరించి అందాల పోటీలా?

- నిరసన తెలిపే హక్కు లేదా?
- 31 వరకు నిరసనలు కొనసాగుతాయి
- మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలును మరిచి రేవంత్ సర్కార్ అందాల పోటీల వెంట పరుగులు పెడుతున్నదని పలు మహిళా సంఘాల నాయకులు విమర్శించారు. బుధవారం మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక దాడిని ఖండిస్తూ హైదరాబాద్ లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్లు లక్ష్మి, ఆశాలత, ఆర్.అరుణజ్యోతి (ఐద్వా), ఇ.హేమలత (ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం), డి స్వరూప, జి ఝాన్సీ, జి భారతి, జి అనసూయ (పిఒడబ్లు), ఎ స్వాతి, ఎడ్ల జయ, వి శ్రీదేవి (సిఎంఎస్), పి తేజ (ఆల్ ఇండియా డెమొక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్), బిఎస్ కృష్ణ (పివైఎల్), కె.రాంబాబు (టిపిఎఫ్), బండారు విజయ, ఎం హైమావతి (రచయిత్రులు) పాల్గొని ప్రసంగించారు. సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం రాష్ట్ర ఇన్‌ఛార్జి ఎస్‌కె జానీ బాషా ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.

ప్రపంచ వేదికలపైన నిరసన తెలిపే హక్కును గుర్తిస్తున్న సమయంలో రేవంత్ సర్కార్ తీరు సరిగా లేదని నాయకులు ఆక్షేపించారు. నిరసన తెలిపేందుకు వెళ్లిన మహిళలను చట్టవిరుద్ధంగా అరెస్టు చేసి రాత్రి సమయంలో పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి రాత్రి పది తర్వాత రోడ్లపై వదిలేశారని తెలిపారు. అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారితో చార్మినార్ వద్ద వాక్ నిర్వహిస్తూ, నిరసనకారుల ఇంటి చుట్టూ పోలీసులను మోహరించి నిర్బంధించారని ఖండించారు. ఇదే విధంగా నిర్బంధం పెంచితే తమ పోరాటం కూడా అంతే తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేయాలని ప్రయత్నించినా సరే అందాల పోటీలు నిర్వహించే మే 31 వరకు తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. నిర్బంధం పెంచి కెసిఆర్ బాటలో సిఎం రేవంత్ రెడ్డి వెళ్లొద్దని హితవు పలికారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మల్లు లక్ష్మి మాట్లాడుతూ అందానికి కొలబద్ద ఏంటని ప్రశ్నించారు. అందం పేరుతో కార్పొరేట్ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకే రేవంత్ సర్కార్ అందాల పోటీలు నిర్వహిస్తున్నదని తెలిపారు. మహిళల పట్ల ఏ విధంగా వ్యవహరించాలో పోలీసులకు శిక్షణ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పటికే మహిళపై పెరిగిన దాడులు అందాల పోటీల లాంటి వాటితో మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అరుణజ్యోతి మాట్లాడుతూ అందాల పోటీలను వ్యతిరేకిస్తూ గత నెలన్నర రోజులుగా ప్రభుత్వానికి అనేక రూపాల్లో చేసిన వినతిని పట్టించుకోలేదని విమర్శించారు. మహిళలు వీరోచితమైన పోరాటాలు నిర్వహించిన గడ్డపై ఇలాంటి పోటీలు పెట్టడం సరికాదన్నారు. నిరసనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆశాలత మాట్లాడుతూ మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం తదితర హామీలేమయ్యాయని ప్రశ్నించారు. ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయకుండా నిరసనకారులపై అత్యవసర పరిస్థితిని మించి అణచివేసేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంధ్య మాట్లాడుతూ రేవంత్ సర్కార్ 7వ గ్యారంటీ భావ ప్రకటనా స్వేచ్ఛను పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ మహిళల ఆకాంక్షలను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. స్వరూప మాట్లాడుతూ అద్దె ఇళ్లలో ఉన్న మహిళను మరింత ఇబ్బంది పెట్టేలా పోలీసుల పహారా కాశారని తెలిపారు. ఇంటి యజమానులు కిరాయిదారులను ఖాళీ చేయించేలా భయభ్రాంతులను చేశారని చెప్పారు. అనసూయ మాట్లాడుతూ ప్రజాధనాన్ని నిరర్థక కార్యక్రమానికి ఎలా వృధా చేస్తారని ప్రశ్నించారు. అందాల పోటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఝాన్సీ మాట్లాడుతూ అందాల పోటీలతో మహిళా సాధికారతకు ఉపయోగం లేదని కొట్టిపారేశారు. అందాలపోటీలకు స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న సర్కారు వారికి ఏం నేర్పిస్తుందని ప్రశ్నించారు.

హేమలత మాట్లాడుతూ మహిళలను కించపరుస్తూ పోలీసులు మొరటుగా లాక్కెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘించారనీ, మహిళల అనారోగ్య సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. జయ మాట్లాడుతూ అందాలపోటీలను అడ్డగించేందుకు తాము వెళ్లలేదని తెలిపారు. రాజ్యాంగ పరిధిలో భావ ప్రకటనా స్వేచ్ఛతో నిరసన తెలిపేందుకు వెళ్లిన తమను అరెస్ట్ చేశారని తెలిపారు. మహిళలను అర్ధనగ్నంగా చూపించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తేజ మాట్లాడుతూ అందాల పోటీలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవాలి

ప్రజలు తమ ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవాలని జానీ బాషా సూచించారు. మహిళల పోరాటానికి ఆయన మద్దతు తెలిపారు. మహిళలు తెలిపిన నిరసన సమాజంలో చర్చకు దారి తీసిందని తెలిపారు. శరీరాన్ని కొలిచి అందమంటే ఎలా అని ప్రశ్నించారు.రి అందాల పోటీల్లో గెలిచిన వారెవరూ ఆ తర్వాత సామాజిక, మహిళా సమస్యలపై మాట్లాడిన దాఖలాలు లేవని కొట్టిపారేశారు. ఎవరు ప్రభుత్వంలోకి వచ్చినా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ నిజాన్ని నిర్భయంగా చెప్పేవారిపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. గతంలో అందాలపోటీల సందర్భంగా మహారాష్ట్రలో బీజేపీ చేసిందే, తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్నదని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంక్షలు..!

- సెల్‌ఫోన్ వాడొద్దంటూ విద్యాశాఖ ఆదేశాలు
- అతిక్రమించే వారిపై చర్యలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి..
- ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగించడంపై ఆంక్షలు విధించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. జిల్లా అధికారులు స్కూళ్లను తనిఖీ చేసి, సెల్‌ఫోన్ వాడే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా విద్యాశాఖ స్పష్టం చేసింది. దాంతో పాఠశాలలో సెల్‌ఫోన్ వాడకంపై ఉపాధ్యాయుల్లో చర్చ నడుస్తోంది. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు అన్నీ కలిపి 505 ఉండగా, మరో 1500 వరకు ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో దాదాపు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడు వేల పైచిలుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. చాలా మంది ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తూ, తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అయితే కొద్దిమంది మాత్రం పాఠశాలకు వచ్చినా నిరంతరం ఫోన్‌లోనే మునిగి తేలుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లినప్పుడు కొందరు టీచర్లు సెల్‌ఫోన్‌లో సంభాషణలు, చాటింగ్‌లతో కాలక్షేపం చేస్తుండటాన్ని చూసి తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి కొందరి మూలంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సడలుతోందన్న విమర్శలూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల్లో సెల్‌ఫోన్ వాడకంపై ఆంక్షలు విధించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల జరిగిన విద్యాశాఖ అధికారుల సమావేశంలో తరగతి గదిలో ఏ ఉపాధ్యాయుడు కూడా సెల్‌ఫోన్ వాడకూడదంటూ ఆదేశాలివ్వాలనీ, ఆకస్మిక తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొందరి వల్ల అందరికీ చెడ్డపేరు..!

ఉపాధ్యాయుల్లో చాలా మంది విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు శ్రమిస్తున్నారు. కొందరైతే ప్రత్యేక తరగతులు కూడా తీసుకోవడం.. విద్యార్థులను వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని వెలికితీస్తూ వారికి వెన్నంటూ నిలుస్తున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వివిధ రంగాల్లో దూసుకుపోతున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఆయా రంగాల్లో విజయవంతం అవుతున్నారు. వారికి గైడ్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు చేస్తున్న శ్రమ వల్లే విద్యార్థులు రాణిస్తున్నారు. అయితే ఇంత కష్టపడుతున్న ఉపాధ్యాయులు ఒకవైపు ఉంటే, కొందరు మాత్రం పాఠశాలలకు రాకుండా రాజకీయాలతో కాలక్షేపం చేస్తూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఒకరిద్దరు డుమ్మాల మాస్టర్లు, బిజినెస్ టీచర్ల ధోరణితో మిగతా వారికీ చెడ్డపేరు వస్తోంది. ఆ కొందరిపై అధికారుల అజమాయిషీ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందనే భావన అందరిలోనూ ఉంది. అధికారులను మేనేజ్ చేసుకుని పాఠశాలకు డుమ్మా కొట్టి సొంత వ్యాపకాల్లో మునిగిపోయి కొందరు, పాఠశాలకు వచ్చినా తమ వ్యాపారాలకు సంబంధించిన వ్యవహారాలపై సెల్‌ఫోన్‌లలో నిమగ్నమవుతూ మరికొందరు ఉంటున్నారు.

ఉపాధ్యాయులపై ఫిర్యాదులు

ఉపాధ్యాయులు పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను అతిగా వినియోగిస్తున్నారని విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఉపాధ్యాయులు తరగతి సమయంలో మొబైల్ ఫోన్లలో నిమగ్నమవడం వల్ల బోధన-అభ్యసన ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని విద్యాశాఖ గుర్తించింది. ఇటీవల హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డిలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో డిఇఒలు, డైట్ ప్రిన్సిపాళ్లకు పాఠశాలల్లో మొబైల్ నిషేధంపై దిశానిర్దేశం చేశారు. జిల్లా విద్యాధికారులు ఈ ఉత్తర్వులను జారీ చేయాలని నిర్దేశించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నిషేధించాలని ఆదేశించారు. జూన్ నుంచి ఈ ఆదేశాలు పటిష్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు.



సెల్ వద్దంటే ఎలా..?

పాఠశాలల్లో సెల్‌ఫోన్ వాడొద్దన్న విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై ఉపాధ్యాయులు భిన్నంగా స్పందిస్తున్నారు. సెల్‌ఫోన్ వాడకుండా ఉండటమే మంచిదని కొందరు అంటుండగా, మరికొందరు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. కుటుంబ సభ్యుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో కాల్ వస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల హాజరు విషయంలో ఫేస్ రికగ్నైజేషన్‌కు సెల్‌ఫోన్ వాడాల్సి ఉంటుందని, చాలా సమాచారం ఫోన్ల ద్వారానే పంపుతామని పేర్కొంటున్నారు. సెల్‌ఫోన్ వాడొద్దంటే ఈ పనులన్నీ ఎలా చేయాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫేస్ రికగ్నైజేషన్, ఆన్‌లైన్ వర్క్స్ కోసం ట్యాబ్స్ గాని, ఇతర పరికరాలు గానీ అందిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కార్మికులతో ఆందోళన చేస్తున్న భూపాల్

4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరిగే సమ్మెలో వలస కార్మకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ కోరారు. రంగారెడ్డి జిల్లా హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్ చౌరస్తాలో మార్బుల్స్ హమాలీ వలస కార్మికులతో బుధవారం సిఐటియు ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులు బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. గత చట్టాల్లో వలస కార్మికులకు రక్షణ చట్టం ఉందని, వారి సంక్షేమ పథకాల వారికి అమలు చేయాలని ఉందన్నారు. కానీ నేడు వలస కార్మికులకు సంక్షేమ పథకాలు అందక చాలా దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారు చేసిన కష్టం ఇంటి అద్దెలకే సరిపోవడం లేదని, కాబట్టి వలస కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేటి పాలకులు అనుసరిస్తున్న విధానాలతో మూడు శాతం ఉన్న ప్రజల వద్ద 70 శాతం సంపద పోగైందని, పైగా వారికే ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నదని తెలిపారు. ఆ మూడు శాతం ప్రజలపై అదనపు పన్నులు వేసి పేదలకు రాయితీలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉచిత విద్యా, వైద్యం సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏదుల గోవిందు, బాలయ్య, లాలూ నాయక్, దుర్గారావు, అజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్ గుంతలో పడి ఇద్దరు బాలురు మృతి

- పొట్ట కూటి కోసం వస్తే కడుపుకోతే మిగిలింది
- ఉప్పల్ భగాయత్‌లో విషాదకర ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకు దెరువు కోసం పట్నానికి వచ్చి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న ఆ కుటుంబంలో పిల్లర్ గుంత విషాదాన్ని నింపింది. ఇద్దరు పిల్లల బతుకులను చిదిమేసి కన్నవారికి కడుపుకోతను మిగిల్చింది. ఓ భవన స్థలంలో పిల్లర్ కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషాద ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన దంపతులు.. సుజాత, వెంకటేష్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి ఉప్పల్ కుర్మానగర్‌లో నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు మణికంఠ (15) అర్జున్ (8), ఒక కుమార్తె ఉన్నారు. కాగా, మంగళవారం తల్లి దండ్రులు పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇద్దరు కుమారులు కనిపించలేదు. దాంతో వారు చుట్టూ పక్కల వెతికి అనంతరం పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం ఉప్పల్ భగాయత్‌లో కులసంఘాల భవనానికి కేటాయించిన స్థలంలో పిల్లర్ కోసం తవ్విన గుంతలో తేలుతున్న శవాన్ని చూసిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సిఐ ఎలక్షన్ రెడ్డి, ఎస్ఐలు, హైడ్రా అధికారులు, డిఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పిల్లర్ కోసం తవ్విన గుంత నుంచి ఇద్దరు బాలుర మృతదేహాలను బయటకు తీశారు. వారు అదృశ్యమైన బాలురుగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు పిల్లల మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీభవన్‌లో సునీతారావు ధర్నా

- క్రమశిక్షణ ఉల్లంఘన :మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళ కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షులు సునీతారావు డిమాండ్ చేశారు. పోస్టుల విషయంలో పార్టీ మహిళా కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్, గాంధీభవన్‌లో ఉన్న టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఛాంబర్ ముందు ఆమె ధర్నాకు దిగారు. పది మంది మహిళా నాయకులతో కలిసి ఆమె కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి జోడు పదవులు ఇస్తున్నారు కానీ మహిళా కాంగ్రెస్ విభాగానికి మాత్రం ఇవ్వడం లేదన్నారు. రెడ్డి, గౌడ్ సామాజిక తరగతుల వారికే పార్టీలో పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు చెల్లెలు, మరదలు అయితే పదవులు వస్తున్నాయని విమర్శించారు. ఒకరికి రెండు పదవులు ఇవ్వటం కుదరంటూ మహేష్‌కుమార్‌గౌడ్ అంటున్నారనీ, ఆయనకు మాత్రం ఎమ్మెల్సీ, అధ్యక్ష పదవి రెండు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన ఒక పదవి వదులుకుని మహిళలకు ఇవ్వాలని కోరారు.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదు

గాంధీభవన్‌లోని తన ఛాంబర్ వద్ద సునీతారావు ధర్నా చేయడం క్రమశిక్షణారాహిత్యమేనని మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. విషయాన్ని ఎఐసిసి దృష్టికి తీసుకెళతానన్నారు. సునీతారావుపై గాంధీభవన్ ఇన్‌చార్జి కుమార్‌రావు ఎఐసిసికి, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు, క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ చిన్నారెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హామీతో ఆమె ఆందోళన విరమించారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ గిరిజన సంఘం నాయకులు

సార్వత్రిక సమ్మెకు గిరిజన సంఘం మద్దతు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మిక, రైతు, సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు తెలంగాణ గిరిజన సంఘం మద్దతును ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీరాంనాయక్, హైదరాబాద్ అధ్యక్షులు రామ్ కుమార్ నాయక్, కిషన్ నాయక్‌లు బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాం నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చినప్పటి నుండి లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా నూతన చట్టాలను ప్రవేశ పెడుతోందని తెలిపారు. అంబానీ, ఆదానీ లాంటి బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడే విధంగా చట్టాలను సవరిస్తున్నదని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా కోట్లాదిమంది గిరిజనులు, దళితులు, బలహీనవర్గాలు, పేదలు ఆధారపడి జీవిస్తుంటే దాన్ని పూర్తిగా రద్దు చేయాలనే కుట్రకు పాల్పడుతున్నదని ఆరోపించారు. బడ్జెట్‌లో గతంలో ఎన్నడు లేని విధంగా కోత పెట్టిందని విమర్శించారు. తరతరాలుగా అటవీ, పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ గిరిజనులను అడవుల నుండి బలవంతంగా గెంటేసే విధంగా అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023 పేరుతో తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఆదివాసి గిరిజనులకు ఉన్న హక్కులతో పాటు ఐదు, ఆరో షెడ్యూల్ ప్రాంత హక్కులు, చట్టాలపై దాడిని తీవ్రతరం చేసిందని తెలిపారు. సమ్మెలో రాజకీయాలకు అతీతంగా ఆదివాసి గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.